నమస్తే కథనంతో పోలీసుల హైరానా

- ఒకే నంబర్‌పై రెండు ఎఫ్ఐఆర్‌ల గుట్టురట్టు
- 'నమస్తే' చేతికి పాత ఎఫ్ఐఆర్ ఎలా వెళ్లిందంటూ పోలీసుల ఆరా
- అధికారులతో సమాలోచనలు జరిపిన రాచకొండ సీపీ
- 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్లపై పోలీసుల నిఘా



(స్పెషల్ టాస్క్‌బ్యూరో)

ఒకే నంబర్... కానీ ఒక ఎఫ్ఐఆర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అంటూ ఉంది... మరో దానిలో పేరు ఉంది... మొదట గుర్తు తెలియని వ్యక్తులు అని ఉన్న ఎఫ్ఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు! ఇదేం ఘోరం అంటూ 'నమస్తే తెలంగాణ' కథనంలో ప్రశ్నించడంతో వెంటనే పాత ఎఫ్ఐఆర్ తొలగించి, ప్రవీణ్‌రెడ్డి పేరు ఉన్న ఎఫ్ఐఆర్‌ను అప్‌లోడ్ చేశారు!! చూశారా... ఎఫ్ఐఆర్‌లో పేరు ఉన్నప్పటికీ 'నమస్తే' కథనంలో మాత్రం అదృశ్య శక్తి ఒత్తిడితో పేరు లేకుండా చేశారనే దుష్ప్రచారం చేస్తున్న దంటూ పోలీసు శాఖ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. కాంగ్రెస్ నేత కూడా అందుకు వత్తాసు పలుకుతూ 'నమస్తే తెలంగాణ'పై అవాకులు చెవాకులు పేలారు.

సీన్ కట్ చేస్తే..

ఒకే నంబరుపై ఉన్న రెండు ఎఫ్ఐఆర్‌ల గుట్టు రట్టయింది. ఎవరు గుర్తిస్తారులే! అనుకుని పోలీసులు తొలగించిన పాత ఎఫ్ఐఆర్ కాపీ 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రత్యక్షమైంది. ప్రవీణ్‌రెడ్డి పేరు ఉంది సరే! మరి పాత దానిలో 'గుర్తుతెలియని వ్యక్తులు' అని ఉండటం వెనుక ఆంతర్యమేంటని 'నమస్తే' నిలదీసింది. దీంతో పోలీసు శాఖ కంగుతిన్నది. ఒకే నంబరుపై రెండు ఎఫ్ఐఆర్‌లా? అని అందరూ ముక్కున వేలేసుకున్నారు. దీంతో రాచకొండ పోలీసులు సోమవారం ఈ పరిణామంపై తీవ్రస్థాయిలో తర్జనభర్జన పడ్డారు.

ఎఫ్ఐఆర్ కాపీ బయటకెలా వెళ్లింది?

బిగ్ బ్రదర్స్ ల్యాండ్ పూలింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. నాదర్‌గుల్‌లోని సర్వేనంబరు 92లోని సుమారు 300 ఎకరాల భూమిపై జరుగుతున్న అనధికారిక ఒప్పందాల వ్యవహారంపై రెవెన్యూశాఖ కంటే ఇప్పుడు పోలీసు శాఖనే పూర్తిస్థాయి దృష్టి సారించింది. ఈ క్రమంలో అక్టోబర్ 31న బాలాపూర్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవీణ్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో పెట్టలేదని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించటంతో 2 రోజుల కిందట రాచకొండ పోలీసులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎఫ్ఐఆర్‌లో ప్రవీణ్‌రెడ్డి పేరు చేర్చినప్పటికీ తప్పుడు కథనాలు రాశారని, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సోమవారం 'నమస్తే' పూర్తి ఆధారాలతో 2 ఎఫ్ఐఆర్‌ల గుట్టు విప్పింది. గుర్తు తెలియని వ్యక్తులుగా ఉన్న ఎఫ్ఐఆర్, ప్రవీణ్‌రెడ్డి పేరుతో ఉన్న ఎఫ్ఐఆర్‌ను బయటి ప్రపంచానికి చూపింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా కంగుతిన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అని ఉన్న ఎఫ్ఐఆర్ కాపీ 'నమస్తే' చేతికి ఎలా వెళ్లింది? అంటూ సోమవారం ఉదయం పోలీసులు ఆరా తీశారు. పోలీసు అధికారులతో రాచకొండ సీపీ సుధీర్‌బాబు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. సోమవారం రాత్రి కూడా టీఎస్ పోలీస్ వెబ్‌సైట్‌లోని ఎఫ్ఐఆర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు అని పేర్కొన్న ఎఫ్ఐఆర్ ఉంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత అందులో ఏమైనా మార్పులు చేయాలనుకుంటే న్యాయస్థానం ద్వారా అనుమతి పొంది మాత్రమే చేయాల్సి ఉంటుందని రిటైర్డ్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కానీ ఇప్పుడు పోలీసులు ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కాగా ఆన్‌లైన్‌లో ఇప్పటికీ గుర్తుతెలియని వ్యక్తులు అని రాసిన ఎఫ్ఐఆర్ ఉండగా... ఆదివారం పరోక్షంగా పోలీసులు, కాంగ్రెస్ పార్టీ సర్క్యులేట్ చేసిన ఎఫ్ఐఆర్‌లో ప్రవీణ్‌రెడ్డి పేరు ఉంది. అంతేగాకుండా రాచకొండ పోలీసులు అధికారికంగా ఇచ్చిన పత్రికా ప్రకటనలోనూ ఎఫ్ఐఆర్‌లో ప్రవీణ్‌రెడ్డి పేరు ఉన్నట్టుగా స్పష్టం చేశారు.

తొలుత కేసు... ఇప్పుడు నిఘా

మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమి కార్పొరేట్ పరం కాకుండా 'నమస్తే తెలంగాణ' కథనం రాసి అధికారులను అప్రమత్తం చేసింది. రైతులు తాత్కాలిక ప్రయోజనాల కోసం భూములను కోల్పోకుండా జాగ్రత్తలు సూచించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఆ భూముల్లో ఎలాంటి కదలికలు ఉన్నాయో పరిశీలించుకుని ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నారు. కానీ పోలీసులు మాత్రం ఓ రైతు ఇచ్చిన ఫిర్యాదును ఆసరాగా చేసుకుని, అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తన ప్రభుత్వ భూమిని అమ్ముకుని ఆర్థికంగా ప్రయోజనం పొందాలనుకుంటే 'నమస్తే' కథనంతో నష్టపోయానని సదరు రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంటే చట్టప్రకారం లావణి పట్టా భూముల క్రయవిక్రయాలు నిషేధం. అది పోలీసులకు కూడా తెలుసు. కానీ రైతు అమాయకంగా నిబంధనలకు విరుద్ధమైన అంశాన్ని అందులో పేర్కొంటే... దాని ఆధారంగా కేసు నమోదు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కాగా తొలుత కేసుతో 'నమస్తే' తెలంగాణను పరోక్షంగా బెదిరించిన పోలీసు శాఖ... తాజాగా రిపోర్టర్లపై తీవ్రస్థాయిలో నిఘా పెట్టినట్లు తెలిసింది.

బావల కండ్లలో ఆనందం కోసం..

'నమస్తే తెలంగాణ'పై నాన్ బెయిలబుల్ కేసులు

- సర్కారులో కీలక బ్రదర్స్.. కీలుబొమ్మగా ఐపీఎస్!
- బిగ్ బ్రదర్స్ దందాలకు అంతాకలిసి వత్తాసు
- 'ల్యాండ్ పూలింగ్' వ్యవహారం భుజాన
- గుర్రంగూడ ఇష్యూను నెత్తికెత్తుకున్న ఆఫీసర్
- రాచకొండలో కబ్జాకోరులకు ఆశీస్సులు!
- ఆయనకు మెండుగా 'బిగ్ బ్రదర్స్' దీవెనలు
- సైలెంట్‌గా సైడ్ అయిపోయిన 'రెవెన్యూ'

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఆయనో ఉన్నత ర్యాంకు కలిగిన ఐపీఎస్ ఆఫీసర్. 'సందులో సడేమియా' అన్న చందంగా సైలెంట్‌గా పనులు చేసుకుంటూ పోతారు. అవకాశం దొరికితే చాలు.. అధికార పార్టీ కీలక నేతలకు ఎవరు దగ్గర ఉంటారో తెలుసుకొని, వారిని ప్రసన్నం చేసుకొని, వారి ద్వారా అసామాన్య పనులు చేయించుకోవడంలో ఆయనది అందెవేసిన చెయ్యి! అదేస్థాయిలో ఆయా నేతలు చెప్పిన 'ఏ పనైనా' ఇట్టే చేసి పెట్టడం ఈయనకు అనుభవంతో వచ్చిన విద్య! ఇన్నాళ్లూ బయటి ప్రపంచానికి తెలియకుండానే పనులు చక్కదిద్దిన ఆయన.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో జూలు విదిల్చారన్న విమర్శలున్నాయి. ఏకంగా బిగ్ బ్రదర్స్‌ను ప్రసన్నం చేసుకోవడం.. వారి దీవెనలు మెండుగా అందడంతో ఆయన కూడా కబ్జాకోరులకు దండిగా ఆశీస్సులిస్తున్నట్టు బాహాటంగానే చర్చ నడుస్తున్నది.

ఉద్యోగ చరమాంకంలో అపఖ్యాతి..

'దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలి' అనే చందంగా ఆ ఐపీఎస్ అధికారి తన కెరీర్ చివరి దశలో అక్రమాలకు తెగపడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తనకు దీవెనలు అందిస్తున్న బిగ్ బ్రదర్స్ కోసం, పోస్టింగ్ ఇప్పించిన 'బావల కండ్లలో ఆనందం' కోసం ఆయన నిందితుల తరఫున వకాల్తా పుచ్చుకొని బాధితులనే బెదిరిస్తూ అపఖ్యాతి మూటగట్టుకుంటున్నారనే వాదనలున్నాయి. ఇన్నాళ్లూ తన కెరీర్‌లో అవకాశం దొరికినప్పుడల్లా అడ్డదారుల్లో దండుకున్న ఆ అధికారి, ఇప్పుడు నేరుగానే రంగంలోకి దిగినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. నగరం నడిబొడ్డున మల్కాజ్‌గిరిలోని 26 ఎకరాల స్థలంలో అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ నేటికీ ఆ ఐపీఎస్ అధికారి ప్రవర్తిస్తున్న తీరును చూసి, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరికి చెందిన ఓ కీలక కాంగ్రెస్ నేతతో చేతులు కలిపి.. వారి ద్వారా బిగ్ బ్రదర్స్ ఆగడాలకు వంతపాడుతున్న ఆ ఐపీఎస్ అధికారి చేష్టలను ఇటు పోలీస్ బాస్ కూడా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.

ఒత్తిళ్లు తట్టుకోలేక రెవెన్యూ సైడ్

గుర్రంపోడు భూముల విషయంలో బిగ్ బ్రదర్స్ రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక స్థానిక రెవెన్యూ అధికారులు ఆ ఇష్యూ నుంచి సైలెంట్‌గా సైడ్ అయిపోయారు. తమ వంతుగా పోలీసులకు ఫిర్యాదు చేసి పక్కకు తప్పుకొన్నారు. అయితే, ఈ కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ ఐపీఎస్ అధికారి మాత్రం.. బిగ్ బ్రదర్స్ డైరెక్షన్‌లో పథకం ప్రకారం స్థానిక రైతులను బెదిరించి, వారితో కేసులు పెట్టించినట్టు తెలిసింది. అంతేకాకుండా 'నమస్తే తెలంగాణ' ప్రస్తావించిన బిల్డర్‌ది ఎలాంటి తప్పు లేదని ఆగమేఘాల మీద తన కిందిస్థాయి అధికారితో ప్రెస్‌నోట్లు ఇప్పించినట్టు తెలుస్తున్నది. బిగ్ బ్రదర్స్ అనుకూల మీడియా, వారి రిపోర్టర్లతో 'నమస్తే తెలంగాణ' మీద కేసు అయిన విషయాన్ని, పోలీసుల వివరణను ఆయా గ్రూపుల్లో చొరవ తీసుకొని మరీ పోస్టు చేయించడం వెనుక కూడా ఆ ఐపీఎస్ అధికారి హస్తం ఉన్నట్టు తెలిసింది.

ఖాళీగా కనిపిస్తే.. కబ్జాలే!

రాచకొండ కమిషనరేట్ పరిధిలో మల్కాజ్‌గిరి, తిరుమలనగర్‌లో యథేచ్ఛగా ల్యాండ్‌మాఫియా విస్తరించిందని బాధితులు చెప్తున్నారు. మల్కాజిగిరిలోని కేసీఆర్ బస్తీలో ఓపెన్ ప్లాట్లు ఉంటే వాటిల్లో గోడలు కట్టి ఆక్రమించుకుంటున్నారని వాపోతున్నారు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న నేతలే ఈ కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని, వారికి ఆ ఐపీఎస్ అధికారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని తెలిసింది. ఆ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న భూ దందాలను ఓర్చుకోలేని ఓ డీసీపీ, పై అధికారులు, అధికార నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక లీవ్‌లో వెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం. మల్కాజ్‌గిరిలో భూదందాపై భూ యజమానులు పోలీసులను కలవడానికి ప్రయత్నించినప్పుడు వారికి పోలీసుల నుంచి విచిత్ర సమాధానాలు ఎదురయ్యాయని బాధితులు వాపోతున్నారు. తమ భూములను వేరేవాళ్లు కబ్జా చేశారంటూ లోకల్ సీఐని కలిసి ఫిర్యాదు చేస్తే పేపర్స్ అన్నీ పరిశీలించి తాను కొత్తగా వచ్చానని, అయినా ఈ విషయంలో మీది కరెక్టే అయినా తామేం చేయలేమని చేతులెత్తేశారని చెప్తున్నారు.

మీడియాను వేధిస్తే ఊరుకోం

- 'నమస్తే తెలంగాణ'పై పెట్టిన కేసును ఖండిస్తున్నాం
- టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అల్లం నారాయణ

టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, అస్కాని మారుతీ సాగర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబరు 4 (నమస్తే తెలంగాణ) : 'సమాజంలో జరుగుతున్న అక్రమాలను వెలికితీయడం మీడియా బాధ్యత. అనేక సందర్భాల్లో ఇలాంటి వార్తా కథనాలు పత్రికల్లో ప్రచురితమవుతుంటాయి. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ల్యాండ్ పూలింగ్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆధారాలతో సహా నమస్తే తెలంగాణ దినపత్రిక వార్త కథనాలను ప్రచురిస్తే కొందరు ప్రైవేట్ వ్యక్తులతో ఆ పత్రికపై కేసు పెట్టించడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండిస్తున్నది. కొందరు వ్యక్తులు తమ స్వార్థం కోసం స్థానికులను పావుగా వాడుకొని పత్రికపై కేసులు పెట్టించే కొత్త పద్ధతికి తెరతీస్తున్నారు..ఇది ఎంత మాత్రం మంచిది కాదు' అని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, అస్కాని మారుతీ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పత్రికల్లో ఏదైనా వార్తా కథనాలు ప్రచురిస్తే దానికి ఖండన గాని, వివరణ గాని ఇవ్వొచ్చు అని, అలాకాకుండా కేసులు పెట్టించడం, భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకునే ప్రయత్నమేనని అల్లం నారాయణ స్పష్టంచేశారు.

గొంతునొక్కే ప్రయత్నం మంచిదికాదు : విష్ణువర్ధన్‌రెడ్డి

మీడియాపై కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ఎంత మాత్రం సబబు కాదని తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ (టీఈఎంజేయూ/టెమ్జూ) అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రమణ కుమార్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ మీడియాను అణచివేసే చర్యగా తాము భావిస్తున్నామని, వెంటనే కేసులను ఉపసంహరించుకునేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిజాలు రాస్తే కేసులా?

- ఫోర్త్‌సిటీ పేరుతో అధికార దుర్వినియోగం
- అక్రమాలను వెలికితీస్తున్న 'నమస్తే తెలంగాణ'పై కక్ష
- పత్రికాస్వేచ్ఛను హరించడమే ప్రజాపాలనా?
- తెలంగాణలో ఇదేం సంస్కృతి?
- ఇష్టారాజ్యంగా భూదందా
- మహేశ్వరంలో మరీ ఎక్కువ
- నాదర్‌గుల్ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా
- రేవంత్ ప్రభుత్వంపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మండిపాటు

బడంగ్‌పేట, నవంబర్ 4 : ఫోర్త్‌సిటీ పేరిట జరుగుతున్న భూ బాగోతాన్ని బయట పెడుతున్నందుకే 'నమస్తే తెలంగాణ' దినపత్రికపై కేసులు నమోదు చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అగ్రిమెంట్లు చేసుకోవడం.. భూములు గుంజుకోవడమే నడుస్తున్నదని, ఫోర్త్ సిటీ పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. నిజాలు రాసిన 'నమస్తే తెలంగాణ'ను, సంబంధిత జర్నలిస్టులను బెదిరించడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఇదేం సంస్కృతి అని, ప్రజా పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. పత్రిక స్వేచ్ఛను హరించడమే ప్రజాపాలనా? అని నిలదీశారు. తెలంగాణలో ఏ మూలన చూసినా భూదందా యథేచ్ఛగా సాగుతున్నదని, ఫోర్త్‌సిటీ పేరిట మాయలో దించుతున్నారని మండిపడ్డారు. అసలు ఫోర్త్‌సిటీ ఎప్పుడు వస్తుందో స్పష్టతే లేదని చెప్పారు. నాదర్‌గుల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 92లో ఉన్న 290 ఎకరాల భూమిపై రైతులకు ప్రభుత్వం ద్వారానే న్యాయం జరగాలని, ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులు ఎలా అగ్రిమెంట్లు చేసుకుంటారని ప్రశ్నించారు. ఒకవేళ రైతుల నుంచి అసైన్డ్ భూమిని తీసుకోవాలంటే ప్రభుత్వం రైతులకు న్యాయం చేసి తీసుకోవాలని, మధ్య వర్తుల బెడద లేకుండా ప్రభుత్వం నేరుగా రైతులతో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు . ఈ విషయంలో ప్రిన్సిపల్ సెక్రటరీకి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. రైతులను మోసం చేస్తున్న వ్యక్తులు ఎంతటివారైనా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని వదిలేసి నిజాలు వెలికి తీస్తున్న 'నమస్తే తెలంగాణ'పై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించాలని ప్రభుత్వం చూస్తున్నదని, ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. వార్తల సేకరణ చేయకుండా భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రతికలపై ఆంక్షలు, జర్నలిస్టులను బెదిరించే పద్ధతి మానుకోవాలని హితవుపలికారు.

పోలీసుల తీరు మార్చుకోవాలి : ఉప్పరి శేఖర్ సాగర్

అక్రమాలను వెలికితీస్తున్న నమస్తే తెలంగాణ దినపత్రికపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని, ఈ ప్రజా పాలనలో భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం ఎంత వరకు సమంజసమని టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్ ప్రశ్నించారు. ప్రభుత్వం, పోలీసులు తీరు మార్చుకోవాలని, లేదంటే సంఘం తరఫున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

'అసైన్డ్'ను అమ్మితే.. అసలుకే ఎసరు!

మొదటిపేజీ తరువాయి...

ఉంటుంది. విక్రయించుకునే వెసులుబాటు సైతం కలుగుతుంది. ఈ నేపథ్యంలో తాత్కాలిక ప్రయోజనాల కోసం తమ భూములను కార్పొరేట్ల పరం చేసి మొదటికే మోసం తెచ్చుకోవద్దని, ప్రభుత్వపరంగా అభివృద్ధికి ఇచ్చి వచ్చిన వాటాను సంతృప్తిగా అనుభవించడం శ్రేయస్కరమని రెవెన్యూ నిపుణులు సూచిస్తున్నారు.

ఆశచూపి కంపెనీల ఒప్పందాలు

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 92లో ఉన్న సుమారు 300 ఎకరాల లావణి పట్టా భూములపై ఓ కంపెనీ కన్నేసి అనధికారిక ఒప్పందం చేసుకోవడం.. దాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేవడంతో ఇప్పుడు అసైన్డ్ భూములపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా నగర శివారులో అనేక కంపెనీలు ఈ భూములపై కన్నేశాయి. సాధారణ పట్టా భూములైతే ధర ఎక్కువ ఉంటుంది. కానీ అసైన్డ్ భూములైతే రైతులు వాటిని విక్రయించుకునే వెసులుబాటు లేదు. దీంతో ఆ రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకొని కార్పొరేట్ కంపెనీలు ఈ భూములపై గద్దల్లా వాలుతున్నాయి. అప్పటికప్పుడు లక్షల ఆశ చూపి.. అనధికారిక ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రికార్డులు మారిన తర్వా త మిగతాది ఇస్తామంటూ నమ్మబలుకుతున్నాయి. ఈ క్రమంలోనే నాదర్‌గుల్ పరిధిలోనూ ల్యాండ్ పూలింగ్ కోసం అనధికారిక ఒప్పందాలు జరిగాయి. వాస్తవానికి పెద్దపెద్ద కాలనీల మధ్య ఉండిపోయిన నాదర్‌గుల్‌లోని 290 ఎకరాల ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం తగ్గిపోయింది. ప్రభుత్వ భూములు కావడంతో రైతులు వీటిని విక్రయించుకునే హక్కులేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పరస్పర ప్రయోజనకరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి ప్రభుత్వం అనుకుంటే పీవోటీ కింద రైతుల నుంచి బలవంతంగా తీసుకుని సర్కార్ ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేయవచ్చు. కానీ కేసీఆర్ ప్రభుత్వం అలా కాకుండా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ చేయాలని భావించింది. అప్పటి అధికారులు సైతం ల్యాండ్ పూలింగ్ చేయాలని నిర్ణయించారు. తద్వారా రైతులకు ఎకరాకు అభివృద్ధి చేసిన ప్లాట్లను 500 గజాల చొప్పున ఇస్తామని ప్రతిపాదిస్తే.. రైతులు వె య్యి గజాలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఎకరాకు 700 గజాల వరకు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. కానీ అదే సమయంలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. వాస్తవానికి ప్రతిపాదన అమల్లోకి వచ్చి ఉంటే రైతులకు సంపూర్ణ హక్కులతో వందల గజాల ప్లాట్లు చేతికొచ్చేవి. అక్కడ ఉన్న రేటు ప్రకారం గజానికి రూ.50-60 వేల వరకు ధర పలికేవి. రైతులకు ప్రయోజనం కలిగేది.

కార్పొరేట్‌తో రెంటికి చెడ్డ రేవడిలా పరిస్థితి..

అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు అనేక హైడ్రామా నడిపిస్తాయి. రైతులకు వెంటనే లక్షల రూపాయలు చేతుల్లో పెట్టి వారిలో ఆశను రేకెత్తిస్తాయి. ఆపై ఒక్కసారి ఒప్పందం పూర్తయిన తర్వాత రైతుల జుట్టు కంపెనీల చేతుల్లోకి వెళ్తుంది. ఈ విషయం బయటికి పొక్కితే రెవెన్యూ శాఖ అప్రమత్తమవుతుంది. అనధికారిక ఒప్పందాలు భూమిలోకి కార్పొరేట్ కంపెనీ వచ్చి కార్యకలాపాలు చేపట్టడాన్ని ఆధారంగా చేసుకొని అసైన్డ్ చట్టం ప్రకారం అధికారులు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం పీవోటీ కింద ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. దీంతో రైతుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారవుతుంది. మరోవైపు కొంతకాలం పాటు కార్పొరేట్ కంపెనీలు తమ పలుకుబడితో రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోకుండా నిలువరించినా అభివృద్ధి చేసిన తర్వాత సదరు కంపెనీ తన వాటా ప్లాట్లను విక్రయించుకొని పోతుంది. ఆపై దానిపై కొర్రీలు మొదలైతే రైతుల చేతుల్లో ఉన్న ప్లాట్లపై వివాదం నెలకొంటుంది. దీంతో వాటిని విక్రయించుకునే పరిస్థితి ఉండదు. నాదర్‌గుల్ పరిధిలోనూ ల్యాండ్‌పూలింగ్ కోసం జరిగిన అనధికారిక ఒప్పందాలు ఈ కోవకే వస్తాయని, ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ, ప్రభుత్వం దృష్టి పెడితే రైతులపై కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నదని, ఇలాంటి ప్రైవేట్ ల్యాండ్ పూలింగ్ వ్యవహారాల్లో తల దూర్చకుండా ప్రభుత్వపరంగా ల్యాండ్ పూలింగ్ చేయిస్తే అన్ని కోణాల్లోనూ రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని రెవెన్యూ నిపుణులు వివరిస్తున్నారు.

బావలు, బ్రదర్స్ కోసం ఇష్యూలు భుజాన

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 'అడ్డం' లేదన్నట్టుగా చెలరేగిపోతున్న ప్రజాప్రతినిధులైన అన్నదమ్ములకు ఈయన దగ్గరి చుట్టం.. వరసకు బామ్మర్ది కావడం గమనార్హం. తాను కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇప్పించడంలో బావలు సాయం చేస్తే.. అందుకు ప్రతిఫలంగా ఈ బామ్మర్ది తన అధికారాన్ని వారికోసం వినియోగిస్తున్నారు. మొన్నటి మల్కాజ్‌గిరిలో 26 ఎకరాల స్థలం వివాదం, గుర్రంగూడలో బిగ్ బ్రదర్స్ ల్యాండ్ పూలింగ్ ఇష్యూలను 'వారి కండ్లలో ఆనందం' కోసం ఆసాంతం తన భుజాల మీద వేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ల్యాండ్ పూలింగ్ వ్యవహారంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'పై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేయడం వెనుకా సదరు ఆఫీసర్‌కు అటు అడ్డం లేని అన్నదమ్ములు, ఇటు బిగ్ బ్రదర్స్ ప్రోత్సాహమే కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కబ్జాపై నిలదీస్తే దౌర్జన్యం చేస్తున్నరు

తిరుమల్‌నగర్‌లోని ఆర్టీసీకాలనీలో మాకు చెరో 80 గజాల చొప్పున 160 గజాల జాగ ఉన్నది. ఆ స్థలాన్ని ఎవరో ఆక్రమించుకుంటే ఇదేందని అడిగినందుకు దౌర్జన్యం చేస్తున్నరు. పోలీసులు పట్టించుకోవడం లేదు..

- బాధితురాలు సుంచె అరుణ ఆక్రందన

పోలీసులు పట్టించుకుంటలేరు

1968లో కోర్టు డిక్రీ ద్వారా మాకు 6.13 ఎకరాల భూమి సంక్రమించింది. మా ఫామ్‌హౌస్‌లో కూరగాయలు పండించుకునేటోళ్లం. అక్కడికి ఇప్పుడు పోతే బెదిరిస్తున్నరు. పోలీస్‌స్టేషన్‌కు పోతే ఏదో నామమాత్రంగా ఎఫ్ఐఆర్ చేసిండ్రు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు

- బాధితుడు కృష్ణ ఆవేదన

రాత్రి వేళ .. చేప పిల్లల విడుదల

- చెరువులో వదిలిన మత్స్యకారులు, కూలీలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా

చెరువుల్లో విడుదల చేసే సమయంలో మృతి చెందిన చేప పిల్లలు

దస్తురాబాద్, నవంబర్ 4 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలోని రెండు చెరువుల్లో సోమవారం రాత్రి చేప పిల్లలను మత్స్యకారులు, కూలీలు, ఫీల్డ్‌మెన్ రవి వదిలారు. మత్స్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోవడం విమర్శలకు తావిస్తున్నది. రెండు చెరువుల్లో కట్ల, రవ్వు, మెరిగల రకాల 43 వేల చేప పిల్లలను వదిలారు. చెరువుల వద్ద మత్స్యకారులు చేప పిల్లల కోసం ఎదురు చూడగా రాత్రి వేళ అధికారులు పంపిణీ చేశారు. చేప పిల్లలు నాసిరకంగా ఉండటంతో కొన్ని మృత్యువాత పడ్డాయి. మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. మత్స్యశాఖ